మాజీ మేయర్‌కు సన్మానం



సన్మానిస్తున్న కాలనీ వాసులు

నిజాంపేట్: ప్రగతినగర్ ఎన్ఆర్ఐ కాలనీ వాసులు ఆదివారం మాజీ మేయర్ కోలన్ నీలాగోపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు కోలన్ గోపాల్‌రెడ్డిలను కలిశారు. ఈ సందర్భంగా వారి ప్రాంతంలో పలు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులు గీసిన చిత్రాల ఎగ్జిబిషన్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సాబేర్ అలీ

నిజాంపేట్: చిన్నారులు గీసిన అద్భుతమైన చిత్రాలను ఆదివారం బండారి లే అవుట్ రోడ్డు నెంబర్ 3బీలో ఉన్న కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 9.30 నుంచి 11గంటల వరకు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ అలీ హాజరై మాట్లాడారు. అనంతరం సన్మానించారు.

శ్రీవాసవి సేవక్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్



నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ పార్క్‌లో ఆదివారం శ్రీ వాసవి సేవక్ సంఘం ఆధ్వర్యంలో రమేష్ క్లినిక్ ఉచిత మెగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రతి ఒక్కరికీ సుమారు రూ.10వేల విలువైన వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్ ఎంతో నిబద్ధతతో వైద్య సేవలు అందిస్తున్నారని స్థానికులు హర్షం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, వాసవి సేవక్ ప్రెసిడెంట్ అల్లాడి మహేష్, టీం సభ్యులు పాల్గొన్నారు.

ఆయుర్ వ్రిక్ష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నిజాంపేట్: నిజాంపేట్ గ్రామం బండారి లేఅవుట్ కాలనీ రోడ్డు నెంబర్ 7బి లైబ్రరీలో ఆదివారం ఆయుర్ వ్రిక్ష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు మాజీ కార్పొరేటర్ ఎల్లంబాయి జ్యోతి, బండారి లేఅవుట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎల్లంబాయి నర్సింహారెడ్డి, కోశాధికారి వువ్వాడ విజయ రవీంద్ర బాబు, కాలనీ సంక్షేమ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



నిజాంపేట్ : ప్రగతినగర్ సుందరయ్య భవనంలో ఆదివారం ప్రగతి చెస్ ఫౌండేషన్ నిర్వహణలో పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డా.రామచంద్రరావు, బయోగ్నిసిస్ ల్యాబ్ సీఎండి, విశిష్ట అతిథి డాక్టర్ ప్రశాంత్ ప్రముఖ సైంటిస్ట్, సుందరయ్య భవన నిర్వాహణ కమిటీ కన్వీనర్ సీహెచ్ఎం చారి, ప్రగతి చెస్ ఫౌండేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. మొదటి, రెండవ బహుమతుల విజేతలకు ప్రత్యేక క్యాష్‌ప్రైజ్ అందజేశారు.

లైంగికదాడి .. పోక్సో కేసు నమోదు

జగద్గిరిగుట్ట : స్టేషన్ పరిధిలో లైంగికదాడి విషయమై పోక్సో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఓ బస్తీకి చెందిన బాలిక(6) పై అదే ప్రాంతానికి చెందిన ఓ బాలుడు (14) శనివారం రాత్రి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆదివారం ఆ బాలిక ప్రవర్తనలో మార్పు కనిపించడంతో వారి తల్లిదండ్రులు ఈ విషయమై ఆరా తీశారు. దీంతో ఆ బాలిక జరిగిన విషయం తెలిపింది. బాలిక తల్లిదండ్రులు ఆదివారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

- ప్రజలు తోడ్పాటునందించాలి
- అసాంఘిక శక్తుల తాట తీస్తాం
- యువత మత్తుకు దూరంగా ఉండాలి
- బాలానగర్ ఏసీపీ పింగళి నరేష్‌రెడ్డి



పింగళి నరేష్‌రెడ్డి, బాలానగర్ ఏసీపీ

కుత్బుల్లాపూర్: 'యువత గంజాయికి బానిస కాకుండా వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తున్నాం. ముఖ్యంగా చదువుకున్న విద్యావంతులే ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పోగొట్టుకుంటున్నారు. వారి నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. ఎట్టి పరిస్థితిలో ఓటీపీ విషయాన్ని గోప్యంగా ఉంచాలి. హిజ్రాలు అతి చేస్తే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం. చిన్నపిల్లలకు ద్విచక్ర వాహనాలు, కార్లు ఇవ్వరాదు. అలా చేస్తే తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తాం' అని బాలానగర్ ఏసీపీ పింగళి నరేష్‌రెడ్డి హెచ్చరించారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆదివారం ఆయన 'సాక్షి' తో పలు విషయాలపై మాట్లాడారు.

ప్రశ్న: గంజాయి విక్రయాలు విపరీతంగా పెరిగాయి. వాటిని ఏవిధంగా అరికడతారు?

ఏసీపీ: బాధ్యతలు చేపట్టగానే యూత్ పై ప్రత్యేక ఫోకస్ పెట్టాను. ముఖ్యంగా గంజాయికి అలవాటు పడ్డ వారిని గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇస్తున్నాము. ఇప్పటికే ఆయా పోలీస్ స్టేషన్ల సీఐలకు బాధ్యతలు అప్పగించి వారిలో మార్పు వచ్చే విధంగా చర్యలు చేపడుతున్నాం. ఇక్కడ గంజాయి విక్రయించే వారి కంటే సేవించే వాళ్లే ఎక్కువగా ఉన్నట్లు గుర్తించాం. తప్పకుండా వారికి సరఫరా చేస్తున్న వారిని కట్టడి చేసి కేసులు నమోదు చేస్తున్నాం. ఇది ప్రత్యేక టాస్క్‌గా ఎంపిక చేసుకుని ముందుకు వెళ్తున్నాం.

ప్రశ్న: బైకు దొంగతనాలను మీరు ఏవిధంగా అడ్డుకుంటారు?

ఏసీపీ: ఇటీవల పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాలు దొంగతనాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. వాటికి ప్రత్యేకంగా నైట్ బీట్ ఏర్పాటు చేసి క్రైమ్ పార్టీ పోలీసులను నియమించాం. ఎవరైనా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసిన వెంటనే కేసు నమోదు చేసి విచారణ జరిపిస్తున్నాం. పాత వాహనాల తాళాలు ఎప్పటికప్పుడు చెకింగ్ చేసుకోవాలి. సీసీ కెమెరాలు ప్రతి ఇంటి ముందు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటే దొంగతనాలు జరిగే సమయంలో అవి ఆధారాలుగా ఉంటూ కేసు త్వరిత గతిన ఛేదించేందుకు ఉపయోగపడతాయి.

ప్రశ్న: సైబర్ నేరాలను అరికట్టడానికి ప్రజలకు మీరిచ్చే సలహా?

ఏసీపీ: సైబర్ క్రైమ్ విషయంలో ఎక్కువగా మోసపోతున్నది విద్యావంతులే. స్మార్ట్ ఫోన్ ఉన్నవారు వివిధ ఓటీపీలు ఓపెన్ చేయడం మూలంగా సులువుగా మోసగాళ్ల చేతికి చిక్కుతున్నారు. మన ఫోన్ బ్యాంకు లింకేజీతో ఉండటం వల్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి. ఈ విషయంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆన్‌లైన్ గేమింగ్ అస్సలు ఆడొద్దు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో సైబర్ వారియర్స్ నియమించి రూ.1.50 లక్ష లోపు మోసపోతే కేసు నమోదు చేసి, అంతకుమించి డబ్బులు పోగొట్టుకున్న వారు వెంటనే 1930 ఫోన్ చేస్తే అకౌంట్ సీజ్ చేసి డబ్బులు వచ్చేలా చేస్తాం. కొంత మంది మోసపోయిన రెండు, మూడు రోజుల తర్వాత వచ్చి ఫిర్యాదు చేయడం మూలంగా ఫలితం లేకుండా పోతుంది.

ప్రశ్న: హిజ్రాల ఆగడాలపై ఏ విధమైన చర్యలు తీసుకుంటారు?

ఏసీపీ: హిజ్రాలు రోడ్లమీద తిరిగి కార్లను ఆపి డబ్బులు డిమాండ్ చేస్తే ఊరుకునేది లేదు. ఇప్పటికే స్థానిక పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న హిజ్రాల జాబితాను తీసుకొని వారిని స్టేషన్ పిలిపించి అవగాహన కల్పిస్తున్నాం. అందరి బంధువుల ముందు ఫంక్షన్‌లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఫిర్యాదు తీసుకొని కేసులు నమోదు చేస్తాం. అటువంటి సంఘటనలు ఎక్కడ జరిగిన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

ప్రశ్న: మైనర్ల విషయంలో తల్లిదండ్రులకు మీరిచ్చే సలహా?

ఏసీపీ: తల్లిదండ్రులు పిల్లలతో అప్రమత్తంగా ఉండాలి. మీ బిజీ షెడ్యూల్ వల్ల దృష్టి పెట్టలేకపోతున్నారు. ఎన్ని గంటలకు వస్తున్నారు? అన్న విషయాన్ని మరిచిపోతున్నారు. వారికి సెల్‌ఫోన్లు ఇవ్వరాదు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదవుతాయి. పిల్లలపై మీరు శ్రద్ధ పెట్టకుంటే రాబోయే రోజుల్లో ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

- ఆపద సమయంలో ఎప్పుడైనా 100 డయల్ చేస్తే ఐదు, పది నిమిషాల్లో అక్కడ పెట్రోలింగ్ సిబ్బంది చేరుకుంటారు. బాధితులకు అండగా ఉంటారు. ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగితే 108 కు ఫోన్ చేయండి.
- బాలనగర్ ఏసీపీ - 9490617101 డివిజన్ పరిధిలో మొత్తం సనత్ నగర్ -949061732, జీడిమెట్ల-9490617220, బాలానగర్-9490617114, జగద్గిరిగుట్ట -949061717 పోలీస్ స్టేషన్లు వస్తాయి. అత్యవసర పరిస్థితుల్లో పై నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి.

ధోబీఘాట్ స్థలం కబ్జాకు యత్నం

అడ్డుకున్న రజక సంఘం నేతలు



షెడ్డు నిర్మాణాన్ని అడ్డుకుంటున్న రజక సంఘం నాయకులు

సుభాష్‌నగర్: ధోబీఘాట్‌కు కేటాయించిన స్థలంలో స్థానికంగా ఉన్న ఓ నాయకుడు షెడ్డు వేస్తుండటంతో రజక సంఘం నాయకులు అడ్డుకున్నారు. సూరారం డివిజన్ రాజీవ్ గాంధీనగర్‌లోని సర్వే నంబర్ 79లో ఆదివారం స్థానికంగా ఉన్న ఓ నాయకుడు షెడ్డు నిర్మిస్తుండగా సదరు స్థలం మా సంఘానికి వస్తుందంటూ శ్రీ మడేల ప్రజా రజక సేవా సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శంకర్ ఆధ్వర్యంలో అడ్డుకొని పనులను నిలిపివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాల ఫలితంగా ప్రభుత్వం రజక సంఘానికి ధోబీఘాట్ నిమిత్తం మూడు ఎకరాలు కేటాయించిందని తెలిపారు. అయితే స్థానికంగా ఉన్న ఓ నేత గుళ్ల పేరిట ఇప్పటికే చాలా రూములు నిర్మించి లక్షలకు విక్రయించాడని ఆరోపించారు. తాజాగా రజక సంఘం స్థలంలో గుట్టు చప్పుడు కాకుండా షెడ్లు నిర్మించి అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు ఎల్లవేళలా సహకారం



ఎంపీ ఈటల రాజేందర్‌ను సన్మానించి వినతిపత్రం అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. యాదవ కమ్యూనిటీ భవనానికి రూ.15 లక్షల ఎంపీ నిధులు కేటాయించడంతో ఆదివారం బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో యాదవ సంఘం సభ్యులు ఎంపీని కలిసి సన్మానించారు. కమ్యూనిటీ భవనానికి అదనంగా రూ.30 లక్షల నిధులు కేటాయించాలని, బాలయ్యనగర్‌లో బీరప్ప ఆలయానికి, చింతల్ చెరుకుపల్లి కాలనీ సంఘానికి శ్రీకృష్ణ మందిరం నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు శాంతి కుమార్ యాదవ్, సమ్మయ్య యాదవ్, కుమార్ యాదవ్, గండిరాజు యాదవ్, సింహ యాదవ్, తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన శిల్పకళకు ఆద్యుడు విశ్వకర్మ



ఎమ్మెల్యేను గజమాలతో సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్

కుత్బుల్లాపూర్: విశ్వకర్మ ప్రాచీన శిల్పకళకు ఆద్యుడని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సూరారం డివిజన్ విశ్వకర్మ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విశ్వకర్మ విగ్రహాన్ని ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు మంత్రి సత్యనారాయణ, హేమలతా సురేష్‌రెడ్డి, విశ్వకర్మ కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సదానందం, శ్రీ విరాట్ విశ్వబ్రాహ్మణ సేవ సంఘం అధ్యక్షుడు కృష్ణమాచారి, కార్యనిర్వహక అధ్యక్షుడు కమ్మరి లక్ష్మణా చారి, సమ్మి రెడ్డి, వాసుగుప్త, పెంటాచారి తదితరులు పాల్గొన్నారు.

- జీడిమెట్ల డివిజన్ ఎం.ఎస్.రెడ్డినగర్ కాశీ విశ్వేశ్వర ఆలయ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఎన్నికైన వివేకానంద్‌కు సన్మాన సభ ఏర్పాటు చేశారు. గజమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనకు హ్యాట్రిక్ విజయాన్ని అందించిన నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. అనంతరం శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ పునః నిర్మాణ పనులకు తోడ్పాటునందిస్తున్న దాతలను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఎం.ఎస్.రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, టెంపుల్ కమిటీ చైర్మన్ ఎస్.గోవర్ధన్ రెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి భరత్, దేవాలయ ప్రధాన కార్యదర్శి శివరాం రెడ్డి, కోశాధికారి రాము, కాలనీవాసులు లక్ష్మీ మోహన్, మోహన్ రావు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి మహోత్సవం.. సాంస్కృతిక కార్యక్రమాలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి, వివేకానందనగర్ కాలనీలోని వీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నూకాంబిక మహోత్సవాల సందర్భంగా నృత్య, లలిత సహస్రనామం, కోలాటం ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళను కాపాడుతూ వస్తున్న మహిళలను సన్మానించి బహుమతులు అందజేశారు. ఉత్సవాల నిర్వహణకు తనవంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు.

దుండగులను వెంటనే అరెస్టు చేయాలి

కూకట్‌పల్లి: విద్యార్థి నాయకుడు సావుల ఆదిత్యపై జూన్ 12 రాత్రి హత్యాయత్నానికి పాల్పడ్డ దుండగులను వెంటనే అరెస్టు చేయాలని ఏబీవీపీ కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్ ఆత్మకూరి శ్రీనాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం కూకట్‌పల్లి బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది కేవలం వ్యక్తిగత స్థాయిలో జరిగిన దాడి కాదన్నారు. ఇలాంటి దాడులకు భయపడేది లేదన్నారు. ఘటన జరిగి మూడు రోజులు గడుస్తున్నా నిందితులను పోలీసులు అరెస్టు చేయకపోవటం అత్యంత దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ బాలకృష్ణ, హైదరాబాద్ మహానగర సంయుక్త కార్యదర్శి భరత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నందు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాల అందజేత

కూకట్‌పల్లి: క్రీడల్లో యువతను ప్రోత్సహించడానికి తనవంతు కృషి చేస్తానని కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి డివిజన్‌లోని వెల్ఫేర్ అసోసియేషన్ వారికి, యువకులకు క్రీడా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకులు క్రీడా పరికరాలను సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలని సూచించారు.

సేవలందించడంలో ముందుంటాం

కూకట్‌పల్లి: సమాజానికి నిస్వార్థంగా సేవలు అందించడంలో రాందేవ్ ఆసుపత్రి ముందుంటుందని ఆసుపత్రి సీఈఓ డాక్టర్ యోబు అన్నారు. ఆదివారం ఆదరణ ఫౌండేషన్ సహకారంతో రాందేవ్ రావ్ ఆసుపత్రిలో 1 నుంచి 16 సంవత్సరాలలోపు పిల్లలకు ఉచితంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్, డాక్టర్ లక్ష్మీ కమలాకర్‌లు అతిథులుగా హాజరై ప్రారంభించారు. జనరల్ స్క్రీనింగ్, ఐ చెకప్, ఇతర వ్యాధులను గుర్తించడానికి రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. పిల్లల వైద్య శిబిరానికి ఆదరణ ఫౌండేషన్ సహకారం అందించినందుకు ఫౌండేషన్ అధ్యక్షులు అరగెల రఘునాథ్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్



మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌ను సన్మానిస్తున్న కార్మికులు

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. ఆదివారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గ పరిధిలోని పలు బస్తీలు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. జోఫ్లో కంపెనీ కార్మికుల సమస్యలు పరిష్కారం కావడంతో శ్రీశైలంగౌడ్‌ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సన్న బియ్యం, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ యువ వికాస్ పథకాల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తోందన్నారు.

ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా రేపు చలో ఇందిరాపార్కు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వామపక్ష నాయికులు

కుత్బుల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును కాలరాస్తోందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు యూసఫ్ అన్నారు. మంగళవారం ఇందిరా పార్కు వద్ద ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం షాపూర్‌నగర్ ఏఐటీయూసీ కార్యాలయంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ.. మావోయిస్టులు చర్చలకు సిద్ధంగా ఉన్నామని చెబుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులను అంతం చేసి ఖనిజాలను, అడవులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యత్నిస్తోందని ఆరోపించారు. ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, నాయకులు నర్సింహారెడ్డి, వంశీ, జంబూ, లక్ష్మి, సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు శ్రీను, కరుణాకర్, బాషా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్



ఓపెన్ జీమ్ పరికరాల పనితీరును పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: హెచ్ఏఎల్ కాలనీ పార్కులో సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. ఆదివారం పార్కులో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఓపెన్‌జిమ్, చిన్న పిల్లల ఆట పరికరాలు, పార్కులోని టాయిలెట్స్, మొక్కలను పరిశీలించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వివిధ సమస్యలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అధికారులతో చర్చిం మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. డివిజన్‌లో హెచ్ఎఎల్ పార్కు ఒక్కటే ఉందని, గతంలో పార్కు అభివృద్ధికి రూ.70 లక్షలతో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఏఎల్ కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కనకదాసు, సెక్రటరీ రాంబాబు, ఉప్పల అశోక్, హరిబాబు, ఆర్‌కే సింగ్, ఎస్ రాజు, జెంషెడ్, హరిబాబు, అశోక్, నాయుడు, నాయకులు మక్కాల సత్యనారాయణ, బాల్‌రాజు, నాగేష్, కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, పోచయ్య, మట్టి శ్రీను, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పశువుల పాక పేరుతో కబ్జా!

- గతంలో కూల్చివేసిన రెవెన్యూ అధికారులు
- రెండు రోజుల నుంచి మళ్లీ నిర్మాణం
- రూ.3 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం



సుభాష్‌నగర్: వరుస రెండు రోజుల సెలవు దినాలు రావడంతో ఓ వ్యక్తి 400 గజాల ప్రభుత్వ స్థలానికి ఎసరు పెట్టాడు. శుక్రవారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు రెండు గదులు, బేస్మెంట్ పశువుల పాక వేసి తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. గాజుల రామారం డివిజన్ ఓక్షిత్ ఎన్‌క్లేవ్‌లోని సర్వే నంబర్ 100లో ఓ వ్యక్తి పశువుల పేరుతో ప్రభుత్వ స్థలంలో ఇప్పటికే పదుల సంఖ్యలో గదులను నిర్మించాడు. గతంలో పలుమార్లు రెవెన్యూ అధికారులు కూల్చివేసినా పట్టు వదలని విక్రమార్కుడిలా తిరిగి అదే స్థానంలో నిర్మాణాలు చేపట్టాడు. మిగిలిన 400 గజాల స్థలం ఖాళీ ఉండగా సదరు స్థలాన్ని కాజేసేందుకు పలుమార్లు పశువుల పాక వేశాడు. ఈ విషయమై ఫిబ్రవరి 14న 'పశువుల పాక కబ్జాలో సర్కారు జాగా' అనే శీర్షికతో సాక్షి కథనాన్ని ప్రచురితం చేయడంతో రెవెన్యూ అధికారులు దాన్ని తొలగించారు. రెండు గదులు ప్రహరీ, పశువుల పాక ఏర్పాటు చేసి 100 సర్వే నంబర్ ను మాయం చేశాడు. కబ్జా చేసిన సదర్ స్థలం మూడు కోట్ల పైన ఉంటుంది. సంబంధిత అధికారులు సదర వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

ఎన్డీఏ పాలనలో దేశం అభివృద్ధి



నిజాంపేట్: ఎన్డీఏ కూటమి పాలనలో దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ నాయకులు అన్నారు. బీజేపీ నిజాంపేట్ అధ్యక్షులు భిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో నిజాంపేట్‌లో కార్యశాల, విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి పార్టీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ శేఖర్ యాదవ్, కో కన్వీనర్ శివాజీ హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 11 సంవత్సరాల సుపరిపాలన పూర్తి చేసుకుందన్నారు. మౌలిక సదుపాయాల విస్తరణ, డిజిటల్ ప్రజా సేవలు, మేక్ ఇన్ ఇండియా, జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ పౌరసత్వ సవరణ చట్టం, జీఎస్టీ, బ్యాంకుల విలీనం వంటి ఎన్నో సంస్కరణల ద్వారా ప్రపంచంలో భారత దేశం అతి శక్తివంతమైన దేశంగా ఏర్పడి వికసిత్ భారత్ వైపు ప్రయాణం చేస్తుందన్నారు.

శ్రీవారి శ్రవణా నక్షత్ర జ్యేష్టాభిషేకం

జగద్గిరిగుట్ట : చింతల్, పద్మా నగర్ ఫేజ్ 1 లోని కల్యాణ తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీవారి శ్రవణా నక్షత్ర జ్యేష్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం శత కలశాలతో తిరుమంజనంతో పాటు అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ మాసంలో ఉత్సవ మూర్తుల శక్తిని పెంపొందించుటకు తిరుమంజనం, జ్యేష్టాభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.







పూజలో పాల్గొన్న భక్తులు